

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డితో కలిసి సోమవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని కేటీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. - చేవెళ్ల రూరల్, డిసెంబర్ 9

వికారాబాద్ : ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 9 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి అందిన ప్రజా వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్‌లతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 118 దరఖాస్తులు రాగా.. భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి కొన్నింటిని సత్వరమే పరిష్కరించారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

పరిగి : అక్రమాలకు పాల్పడిన నస్కల్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఫరూఖ్ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలని పరిగి మండలం నస్కల్ గ్రామస్తులు ప్రేమ్‌కుమార్, రత్నం, ఆలంపల్లి బాల్‌రాజ్, మహ్మద్ హుస్సేన్, బాయికాడి మల్లయ్య, కోమటి నరేశ్ ప్రజావాణిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామాభివృద్ధికి వచ్చిన నిధులను సొంతానికి వాడుకొని, గ్రామంలో గ్రూపు రాజకీయాలు చేస్తున్న గ్రామ కార్యదర్శి ఫరూఖ్ హుస్సేన్.. తాను స్పీకర్ మనిషినని, తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు వచ్చిన నిధులు రూ.12,01,454లలో సొంతానికి రూ.2,49,117 వాడుకున్నారని, పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.3,92,000 కాగా రూ.5,20,750 ఇచ్చినట్లు చూపించారన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఈ విషయమై డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేయగా గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు సీజ్ చేసి తీసుకువెళ్లారు తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కు కలెక్టర్ సూచించారని గ్రామస్తులు తెలిపారు. డీఆర్‌డీవో శ్రీనివాస్ ఈ ఫిర్యాదును డీపీవోకు ఇచ్చారని, చర్యలు చేపట్టాలని సూచించారన్నారు.

అడిగితే అరెస్టులా..?

- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి
- చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్ : పోలీసుల అదుపులో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 9 : గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను అడిగితే అరెస్ట్ చేయడం అన్యాయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈమేరకు సోమవారం తెల్లవారుజామున లక్ష్మీనర్సింహారెడ్డిని ఆయన ఇంటి వద్ద పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లు తమ సొంత నిధులను వెచ్చించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారని, బిల్లులు చెల్లించాలని అడిగితే సర్పంచ్‌లను నిర్బంధించడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు రూ.1,500 కోట్లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికం

దోమ : మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల కోసం సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమం కోసం హైదరాబాద్ నగరానికి వెళుతున్న సర్పంచ్‌లను అడ్డుకొని పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని దోమ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లు అభివృద్ధి పనుల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి పనులను పూర్తి చేసినప్పటికీ.. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా వేధించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా కాంట్రాక్టర్లకు కమీషన్‌లపై వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లులు చెల్లించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు.

దోమలో మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం

పరిగి : పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పరిగి పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, జగన్, శ్రీనివాస్, రాంచంద్రయ్య, ప్రవీణ్‌లతోపాటు పలువురిని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకుడు రవికుమార్ కలిసి తమ సంఘీభావం తెలిపారు.

అడ్డుకున్న పోలీసులు

మర్పల్లి : మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల గురించి రాష్ట్ర సర్పంచుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరుకాకుండా మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మయ్య, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుకర్, అశోక్, పీర్యానాయక్, మిత్ర, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

షాద్‌నగర్ : చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, కొత్తూరు, నందిగామ మండలాల్లో సోమవారం సర్పంచులను ఎక్కడిక్కడే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ బిల్లులు చెల్లించాలని ఏడాదికాలంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

మర్పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచులతో ఎస్సై సురేశ్

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన మాజీ సర్పంచులు

దాడిని ఖండిస్తున్నాం

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 9 : తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కోర్లోని డీఎంఈ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్స్ తలపెట్టిన ఆందోళనలో పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకుని అరెస్ట్ చేయటం దారుణమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆశా వర్కర్లపై మగ పోలీసులతో దౌర్జన్యం చెయ్యటం దుర్మార్గమన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఆశా వర్కర్లను వెంటనే విడుదల చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, డిసెంబర్ 9 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీతతో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖలవారీగా సమీక్షించారు. ఫైల్స్ పెండింగ్‌లో పెట్టకుండా నిబంధనల ప్రకారం పనులు చేయాలని, పెండింగ్ పనులను ముందుగా పరిష్కరించాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో రెవెన్యూశాఖ-45, ఇతర శాఖలకు సంబంధించి 7 మొత్తం 52 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

టీకా బండ్లు ప్రారంభం

నూటికి నూరు శాతం టీకాలను పిల్లలు, గర్భిణులకు ఇవ్వాలనే అక్ష్యంతోనే ఈ టీకా బండ్లను ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. రంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో 3 సంచార ద్విచక్ర టీకా బండ్లను జెండి ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణం, మారుమూల బస్తీలు, మురికివాడలు, ప్రజా రవాణా పాయింట్లు, జాతరలు, జనసాంద్రత అధికంగా కలిగిన ఆవాసాల్లో ఆరోగ్య సిబ్బంది ఈ బండ్ల ద్వారా అక్కడికి చేరుకుని టీకాలు ఇస్తారన్నారు. వైద్యాధికారులు నిర్లక్ష్యం చేయకుండా వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి షేబాహయత్, డిప్యూటీ డీహెంహెచ్‌వో డా.రాకేశ్, డీపీవో అక్రమ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులు వెలిగించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమరవీరులకు నివాళి

పరిగి, డిసెంబర్ 9 : విజయ్ దివస్ సందర్భంగా సోమవారం సాయంత్రం పరిగిలోని కొడంగల్ క్రాస్ రోడ్డులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఉద్యమనాయకుడు కేసీఆర్ చేసిన దీక్షతోనే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు గౌస్‌పాషా, రవికుమార్, కృష్ణ, తాహెర్‌అలీ, ఆసిఫ్ పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..

- ఉపాధ్యాయుల తీరుపై స్థానికుల మండిపాటు
- ఒకే ఆటోలో 17 మంది విద్యార్థుల ప్రయాణం
- సీఎం కప్ క్రీడలకు వచ్చిన విద్యార్థులు

నవాబుపేట జడ్పీ ఉన్నత పాఠశాల గేట్ వద్ద పిల్లలను ఆటోలో ఎక్కిస్తున్న ఉపాధ్యాయులు

నవాబుపేట, డిసెంబర్ 9 : బస్సు సౌకర్యం లేక, ప్రమాదమని తెలిసినా పట్టించుకోకుండా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఉపాధ్యాయులను చూసి పలువురు స్థానికులు, వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మీనపల్లి కలాన్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులు సోమవారం నవాబుపేట జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలకు ఆటోలో వచ్చి తిరిగి ఆటోలోనే అధికంగా విద్యార్థులను తీసుకెళ్లడంపై విమర్శలు చేస్తున్నారు. ఒకే ఆటోలో 17 మంది విద్యార్థులను తీసుకెళ్లగా.. పిల్లల జీవితాలంటే అంత చులకనా అని మండిపడుతున్నారు. మీనపల్లి కలాన్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభు (హిందీ పండిట్), విజయ్‌కుమార్ (ఇంగ్లిష్) విద్యార్థులను ఆటోలో ఎక్కించి వారు మాత్రం బైక్‌లపై వెళ్లడం వారి నిర్లక్ష్యానికి ప్రతీక అని పేర్కొంటున్నారు. విద్యార్థులు క్షేమంగా వెళ్లారా లేదా అని తెలుసుకోవలసిన బాధ్యత లేదా అని స్థానికులు వాపోతున్నారు.

వివరాలు తెలుసుకుంటా..

సీఎం కప్ నిర్వహించడానికి విద్యార్థులను ఇక్కడికి తీసుకువచ్చారు. బస్సు సౌకర్యం లేక ఆటోల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. ఒకే ఆటోలో 17 మందిని తరలించడంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటాను. తమకు ప్రభుత్వం నుంచి ఆటలకు సంబంధించిన విషయాలను నోడల్ అధికారి అయిన ఎంపీడీవో ముందస్తుగా వెల్లడించలేదు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటాను.

- ఎంఈవో అబ్దుల్ రహమాన్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు

వికారాబాద్, డిసెంబర్ 9 : వికారాబాద్ జిల్లా సమీకృత కార్యాలయంలో సోమవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహ అధ్యక్షుడు శ్యామ్ ఆధ్వర్యంలో జరిగాయి. గెజిటెడ్ అధికారుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డీఎస్‌సీడీవో ఎన్.మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా డీహెచ్ఎస్‌వో ఎంఏ సత్తార్ ఎన్నికైనట్లు సంఘం ఎన్నికల అధికారి రామ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు కోటాజీ, దీపారెడ్డి, శిరీష, రామారావు, జిల్లా అధికారులు కమలాకర్‌రెడ్డి, కృష్ణవేణి, జ్ఞానేశ్వర్, ఉపేందర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదిబట్ల, డిసెంబర్ 9 : తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు మినిమమ్ టైమ్ స్కేల్ ఎంటీఎస్ కల్పించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రంగారెడ్డి జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో నిరసనతో కూడిన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి పలు సమస్యలను విన్నవించారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 20 లక్షలు, ఆరోగ్య బీమా 10 లక్షలు, రిటైర్ అయిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద 25 లక్షలు, ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. వాగ్దానాలను అమలు చేయకపోతే ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు

ముగిసిన ఆదిభట్ల మహోత్సవం

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకర మఠం ప్రాంగణంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు మహోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయని తెలంగాణ హరిదాసుల సంఘం కార్యదర్శి జే.జయరాం భాగవతులు తెలిపారు. అనంతరం, అన్నమయ్య పరివారం వ్యవస్థాపకులు యనమండ్రవ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ, నారాయణదాసు 1991లో విజయనగర మహారాజ స్థాపించిన శ్రీ విజయరామ సంగీత, నృత్య పాఠశాలకు ప్రథమ అధ్యక్షులుగా పనిచేసి ఎంతో మంది హరిదాసులను, విద్వాంసులను తీర్చిదిద్ది భక్తిని, ముక్తిని, భుక్తిని కల్పించి తరించారని కీర్తించారు. కార్యక్రమంలో పాండురంగ శర్మ, హరినారాయణ ఉమాదేవి, శారద పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో దాడి

- భార్య పుట్టింటినుంచి రావడంలేదనే కోపంతో అఘాయిత్యం
- కేకలు వేయడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న కొడుకు
- చికిత్స నిమిత్తం దవాఖానకు తరలింపు

పోలీసుల అదుపులో నిందితుడు

గాయాలపాలైన బాలుడు అరవింద్

తాండూరు రూరల్, డిసెంబర్ 9 : భార్య ఇంటికి రావడంలేదనే కోపంతో కొడుకుపై కత్తితో దాడి చేసి, హత్య చేసేందుకు యత్నించిన ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం, మల్కాపూర్ గ్రామానికి చెందిన మల్కెడ్ హనుమంతు భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. హనుమంతు నిత్యం భార్యతో గొడవపడేవాడు. బాధలు భరించలేని భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. భార్య ఇంటికి తిరిగి రావడంలేదనే కోపాన్ని పెంచుకొని, తన వద్ద ఉన్న కొడుకు అరవింద్‌ను చంపితే భార్య ఇంటికి వస్తుందని ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న కత్తితో కొడుకు అరవింద్ మెడ, చేతులు, శరీరంపై విచక్షణారహితంగా దాడికి దిగాడు. మెడకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. అరవింద్ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి దవాఖానకు తీసుకెళ్లి కాపాడారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని హనుమంతుపై కండ్లపల్లి అశోక్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాగులో కెమికల్ డంపింగ్

వికారాబాద్, డిసెంబర్ 9 : మోమిన్‌పేట మండలం రామనాథ్‌గుడుపల్లి వద్ద వాగులో గుర్తు తెలియని వ్యక్తులు విషపూరితమైన కెమికల్‌ను వదిలినట్లు స్థానికులు, ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో నీరు పూర్తిగా కలుషితమైంది. ఈ విషయమై మోమిన్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కెమికల్ కలిసిన నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఎవరు వేశారు.. ఎందుకు వేశారనే వివరాలు తెలుసుకుంటామన్నారు.



కెమికల్ నీటితో పారుతున్న వాగు

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/ఐడీ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పరిపాలనాపరమైన పదవుల నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 9 : ఓయూలో పలు పరిపాలనాపరమైన పదవుల నియామకాన్ని చేపట్టారు. ఓయూ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ లింగప్ప, సెంటర్ ఫర్ మైక్రోబియల్ అండ్ ఫర్మంటేషన్ టెక్నాలజీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భీమా, జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ హమీదాబీ, సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్ స్టడీస్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసులు, జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శివరామకృష్ణ, సెంటర్ ఫర్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీవీ సుధ, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్యామల, రూసా 2.0 కోఆర్డినేటర్‌గా డాక్టర్ అనుపమ, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్‌గా డాక్టర్ రామ్ షెఫర్డ్ నియమితులయ్యారు. ఈమేరకు వారికి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

కెనరా బ్యాంక్ ద్వారా ఎంఎస్ఎంఈ లోన్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : స్మాల్ అండ్ మీడియం పరిశ్రమలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేలా కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ క్లస్టర్ కార్యక్రమం జరుగనున్నది. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో 238 ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో రూ.6200 కోట్లు రుణాలు మంజూరు చేయనున్నారు. కెనరా బ్యాంక్ సీఈవో, ఎండీ సత్యనారాయణ రాజు కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తూ పారిశ్రామిక రంగాన్ని వృద్ధి చేయడంలో కెనరా బ్యాంక్ ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఈడీ దేబాషిష్ ముఖర్జీ, అశోక్ చంద్ర, హర్దీప్‌సింగ్ ఆహ్లూవాలియా, భవేంద్రకుమార్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.